

# సెకండ్ లిస్ట్.. ఫైనల్

## 53 స్థానాల అభ్యర్థులకు ఏఐసీసై గ్రీన్ సిగ్నల్

- ఇవ్వాల జరిగిన కాంగ్రెస్ సీఈసీ భేటీలో ఆమోదం
- ఏ క్షణంలోనైనా జాబితా విడుదలకు చాన్స్
- ఆశావహుల్లో పెరిగిన ఉత్కంఠ

తెలంగాణ మలివిడత అభ్యర్థుల జాబితా ప్రకటన నేపథ్యంగా సాగిన కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ముగిసింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన శుక్రవారం ఉదయం గంటన్నరపాటు ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో 53 స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేశారు. కాగా, ఈ జాబితాకు ఆమోదముద్ర పడినట్లు తెలుస్తోంది. ఏ క్షణమైనా తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే.. అభ్యర్థుల ప్రకటన విషయంలో కాంగ్రెస్ ట్విస్ట్ ఇవ్వబోతున్నట్లు సమాచారం. అభ్యర్థుల ప్రకటనకు ముందే కాంగ్రెస్ అధిష్టానం నష్టనివారణ చర్యలకు దిగింది. వామపక్షాలకు కేటాయించే స్థానాలతో పాటు మొత్తం 11 స్థానాలు పెండింగ్‌లో ఉంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

**అశోక్ చౌహాన్‌కు కీలక బాధ్యతలు..**

మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చౌహాన్‌కు కాంగ్రెస్ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయన సూచనల మేరకే అభ్యర్థుల పేర్లను ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. అంతా సవ్యంగా ఉందనుకున్న సెగ్మెంట్లకు నేటి జాబితాలో చోటు దక్కినట్లు సమాచారం. కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ మొత్తం అభ్యర్థులను ఖరారు చేసినప్పటికీ.. చౌహాన్ కమిటీ సూచన మేరకు విడతల వారీగా ఈ నెల 31లోపు పూర్తిస్థాయి అభ్యర్థుల జాబితా ప్రకటించే అవకాశాలున్నాయి. మరోవైపు ఆలస్యమైనా ఆచితూచే అభ్యర్థుల ప్రకటన చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తుంటే.. ఈ నిర్ణయం ఆశావహుల్లో మాత్రం తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

# హామీలిచ్చేయ్! అటెన్క చూద్దాం!



- ఇదీ తెలంగాణలో పార్టీల తీరు
- ఎడాపెడా హామీల వర్షం
- రాష్ట్ర బడ్జెట్ సైజ్ రూ. 3.5లక్షల కోట్లకు మించితేనే ఇవన్నీ సాధ్యం
- రాబడులు రూ. 1.40లక్షల కోట్లకు మించని వైనం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హామీలేవైనా ఇద్దాం...అధికారంలోకి వచ్చేద్దాం అన్నట్లుగా తెలంగాణలో రాజకీయ పార్టీలు ఎడాపెడా హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఇందులో సంక్షేమ రంగంపై ఎక్కువ హామీలనిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలను అన్ని పార్టీలూ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోలు, బహిరంగ సభలు సంక్షేమ రంగానికే అత్యంత ప్రాముఖ్యతనిస్తూ హామీలను గుర్తు చేస్తూ ముందుకు సాగుతున్నాయి. అధికార బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలు ఇదే దారిలో పయణిస్తున్నాయి. బీజేపీ ఇంత వరకు మ్యానిఫెస్టో విడుదల చేయకపోయినా వారి ప్రాధాన్యత సంక్షేమానికేనని ఆపార్టీ పెద్దలు ఇప్పటికే ప్రకటించారు.

**ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్..**

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ఇప్పటికే మ్యానిఫెస్టోను ప్రకటించింది. అవేకాకుండా వివిధ పేర్లతో డిక్లరేషన్లను ప్రకటించింది. మహాలక్ష్మి పేరిట ప్రతీ మహిళకు రూ. 2500, రూ. 500లకు గ్యాస్ సిలిండర్, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా పథకం పేరుతో ఏడాదికి ఎకరాకు రూ. 15వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు, వరి పంట బోనస్ రూ. 500, అన్ని కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లకు రూ. 5లక్షలు, విద్యార్థులకు రూ. 5లక్షల వరకు వడ్డీలేని రుణాలు, మహిళలకు రూ. 4వేల పింఛన్ వంటివి ప్రధానంగా ప్రకటించింది. ఇక అధికార బీఆర్ఎస్ రైతుబంధు సాయం దశల వారీగా పెంపు,. సామాజిక పింఛన్ల పెంపుదల, రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డుదారుల కుటుంబాలకు రైతు బీమా తరహాలో రూ. 5లక్షల బీమా, మహిళలకు నెలకు రూ. 3వేల సాయం, రూ. 400లకే సిలిండర్, ఆరోగ్య శ్రీ గరిష్ట పరిమితి రూ. 15లక్షలకు పెంపుదల, పేదలకు ఇండ్ల స్థలాలు, అగ్రవర్ణ పేదలకు రెసిడెన్షియల్ పాఠశాలలు, అసైన్డ భూములపై అధికారం బదలాయింపు వంటివి చెప్పింది.

అయితే రాష్ట్ర వార్షిక బడ్జెట్ 202324లో 2.90లక్షల కోట్లకు పరిమితమైంది. ఇందులో రూ. 2.58లక్షల కోట్లు అన్ని రకాల రాబడులతో సమకూర్చుకుంటామని సర్కార్ అంచనా వేసింది. 2022 23లో రాష్ట్ర రాబడుల అంచనా రూ. 2.45 లక్షల కోట్ల రాబడి అంచనాలు వేసుకోగా, ఇందులో రూ. 1.92 లక్షలకే పరిమితమైంది. ఇందులోనుంచి సబ్సిడీలు, వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లకు రూ. 80వేల కోట్లకుపైగా వ్యయం చేశారు. అయితే సంక్షేమానికి, ఇతర రంగాలకు కేటాయింపులు ఇంకా మరో 40శాతం ఉంటాయి. కానీ పార్టీలు ప్రకటించిన హామీలను గమనిస్తే బడ్జెట్ సైజ్ రూ. 3.5 లక్షల కోట్లకు మించాల్సి ఉంటుంది.

**కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పరిశీలిస్తే..**

విద్యార్థుల కోచింగ్ ఫీజుకు రూ.5 లక్షల వరకు సహాయం చేస్తామనే మాట ఎలా అమలు చేస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులకు కూడా ఏటా రూ.5 లక్షల కోచింగ్ ఫీజు లేదు. ఇది ఒక డొల్ల హామీ తప్ప ఇంకేమి కాదనే అభిప్రయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రారంభించిన పథకాలనే బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నదని, అప్పులు పెరిగాయని ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ అవే పథకాలకు మరింత సాయం పెంపును ఎనలిస్టులు విమర్శిస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర బడ్జెట్, రాష్ట్రం చేస్తున్న అప్పులు, ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు నెల మొదటి తేదీనే జీతాలు చెల్లించలేని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు చెబుతూనే ఉన్నాయని, అయినప్పటికీ బీఆర్ఎస్ కంటే మించి తాము నెలనెలా జనాలకు నగదు ఇస్తామని చెప్పడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంగా పేర్కొంటున్న పరిస్థితి నెలకొంది.

**బీఆర్ఎస్ మేనీఫెస్టోపై సర్వత్రా ఆసక్తి..**

తెలంగాణలో కాంగ్రెస్ మ్యానిఫెస్టో చూసిన తర్వాత బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. హామీల విషయంలో గులబీ దళపతి, సీఎం కేసీఆర్ ఆచితూచి వ్యవహరించారని పొలిటికల్‌అనలిస్టులుచెబుతున్నారు.సీఎం బ్రేక్ఫాస్ట్ పథకం, ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ పెంపుదల, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంలాంటివన్నీ ఇప్పటికే ఆచరణలోకి వచ్చాయని గుర్తు చేస్తున్నారు. రైతుబంధు, పెన్షన్లను దశలవారీగా రాబడిని చూసుకొని పెంచుతామని ఇచ్చిన హామీని ఆర్థిక నిపుణులు స్వాగతిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం కేసీఆర్ ఆచరణ సాధ్యం కాని హామీల జోలికి వెళ్లలేదని, సీఎంగా పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన నేతగా ఓ రకంగా చెప్పాలంటే కాస్త బాధ్యతగానే వ్యవహరించారని అభిప్రాయపడుతున్నారు. దశలవారీగా పెన్షన్లు పెంచుతామని చెప్పారు. అంటే వచ్చే ఎన్నికల నాటికి సామాజిక పెన్షన్లు తలా ఒక్కరికి రూ. 5వేలకు చేరుతాయి. కానీ కాంగ్రెస్ మాత్రం గెలవగానే రూ. 4వేలు వేలు ఇస్తామని చెబుతోంది. ఇక లబ్ధిదారులు ఎవరికి ఓటేస్తారో చూడాలి. బీఆర్ఎస్ కన్నా మిన్నగా సంక్షేమ పథకాలని అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. విభిన్న వర్గాలకు నగదు మొత్తాలను నజరానాగా ప్రకటించారు. తాము ఇచ్చే హామీల అమలుకు ఎన్ని వేల కోట్ల వ్యయం అవుతుందో, ఆ నిధులని ఎలా సమీకరిస్తామో చెప్పడంలేదు. దీంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగానే వీరి హామీలు నమ్మడానికి జనాలు సిద్ధంగా లేరని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అంతేగాక ఇదేవిధమైన హామీలను వారు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎందుకు అమలు చేయడం లేదనే బీఆర్ఎస్ నేతల ప్రశ్నలకు ప్రజలనుంచి సంపూర్ణ మద్దతు వస్తోంది.

## అమరవీరుల బలిదానం
# ప్రేరణ కావాలి

### పాసింగ్ పరేడ్ లో అమిత్ షా



**హైదరాబాద్:** వివిధ రకాల వ్యవస్థీకృత నేరాలు సవాళ్లు విసురుతున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. కర్తవ్య నిర్వహణలో అమరవీరుల బలిదానం ప్రేరణ కావాలని చెప్పారు. హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో 75వ బ్యాచ్ ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. 175 మంది ట్రైనీ ఐపీఎస్‌లు శిక్షణ పూర్తిచేసుకోవడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ట్రైనీ ఐపీఎస్‌ల నుంచి ఆయన గౌరవవందనం స్వీకరించారు.

అనంతరం మాట్లాడుతూ, ''మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభించాయి. కర్తవ్య నిర్వహణలో అమరవీరుల బలిదానం ప్రేరణ కావాలి. వివిధ రకాల వ్యవస్థీకృత నేరాలు సవాళ్లు విసురుతున్నాయి. క్రిప్టో కరెన్సీతో దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనానికి యత్నిస్తున్నారు. హవాలా, నకిలీ నోట్ల కట్టడికి మరింత పటిష్ఠంగా పోరాడాలి. ఆంగ్లేయుల కాలం నాటి 3 చట్టాలను మార్చాల్సి ఉంది. సీఆర్‌పీసీ, ఐపీసీ, ఎవిడెన్స్ చట్టాల్లో మార్పులు చేయాల్సి ఉంది. ఈ మూడు చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసి పార్లమెంట్ ముందుంచింది. త్వరలోనే నేర చట్టాల బిల్లు ఆమోదం పొందుతుంది. శాసనాలను సురక్షితంగా ఉంచడమే పాత చట్టాల ఉద్దేశంగా ఉండేది. ప్రజల హక్కులను సురక్షితంగా ఉంచడం కొత్త చట్టాల ఉద్దేశం. కొత్త చట్టాల ఆధారంగా అధికారులు ప్రజలకు రక్షణ కల్పించాలి'' అని అమిత్‌షా పిలుపునిచ్చారు. ట్రైనీ ఐపీఎస్‌ల్లో 14 మందిని తెలుగు రాష్ట్రాలకు కేటాయించారు.

### సూర్యాపేటలో బిజెపి జనగర్జన... హాజరుకానున్న అమిత్ షా..

ఢిల్లీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూర్యాపేటలో బీజేపీ నిర్వహించబోతున్న జనగర్జన సభలో పాల్గొనబోతున్నారు. తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో అమిత్ షా బిజెపి విజయానికి ప్రత్యేక దృష్టి సారించారు.. దీనిలో భాగంగానే సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు.. ఈ సభ నేటి సాయంత్రం 4 గంటలకు జరగనుంది.. సభ ముగిస అనంతరం అమిత్ షా ఢిల్లీకి పయనం కానున్నారు.

# నువ్వా.. నేనా!

- రాజేంద్రనగర్ లో కాంగ్రెస్ టికెట్ తీవ్రపోటీ
- టికెట్ తనకేనంటున్న నరేందర్
- ఆశలు వదులుకోని జ్ఞానేశ్వర్
- ప్రచారంలో దూసుకుపోతున్న 'హస్తం' నేతలు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. మొత్తం 11మంది నేతలు దరకాస్తు చేసుకోగా, ఇద్దరి మధ్యలోనే ప్రధానంగా తీవ్రపోటీ ఉంది. గత రెండు పర్యాయాలు పోటీ చేసి పరాభవం పొందిన జ్ఞానేశ్వర్, మరోసారి తన అదృష్టం పరీక్షించుకోవాలని తహతహలాడుతున్నారు. కాగా, అనూహ్యంగా మణికొండ మున్సిపల్ ఛైర్మన్‌కస్తూరినరేందర్‌ముదిరాజ్‌పేరు తెరపైకివచ్చింది.అన్ని ఇంటెలిజెన్స్



సర్వేలు సైతం నరేందర్‌కు జై కొట్టాయి. దీంతో నరేందర్ వైపు అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

**నేడో, రేపో రెండో జాబితా..**

నేడో, రేపో వచ్చే రెండో జాబితాలో తన పేరు ఉంటుందని కస్తూరి నరేందర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు నేతలు పోటీపడి నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, శాస్త్రీపురం, సులేమాన్ నగర్ డివిజన్లతో పాటు శంషాబాద్, గండిపేట మండలాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. పోటాపోటీగా జరుగుతున్న ప్రచారం కార్యకర్తల్లో జోష్ నింపుతున్నా... ఎవరికి టికెట్ వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. టికెట్ ఎవరిని వరిస్తుందో అనే అంశంపై నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

# సారీ.. అలా కొట్టడం కరెక్ట్ కాదు

- తప్పు నాదే నన్ను క్షమించండి.
- అనుకోకుండా జరిగింది!
- క్షమాపణలు చెప్పిన ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్



రాంలీలా మైదానంలో జరిగిన ఘటనపై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద స్పందించారు. జరిగిన సంఘటనపై చింతిస్తున్నానని క్షమాపణలు చెప్పారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు తప్పులు ఎత్తి చూపడంలో తప్పులేదని, విపక్షాలు ఏవరైనా ప్రభుత్వాన్ని అడగొచ్చన్నారు. తనపై తీవ్ర పదజాలంతో ఆరోపణ చేయడం తీవ్ర బాధను కలిగిందన్నారు. తన తండ్రి అయిన కేఎం పాండు సర్పంచ్‌గా, మున్సిపల్ ఛైర్మన్‌గా అనేక సేవలు చేసి ప్రజల మన్నానలను పొందారన్నారు. కానీ, వ్యక్తిగతంగా అలాంటి మనిషిని నానా మాటలు అనడంతో సహించలేకపోయానని వెల్లడించారు. ఇష్టమచ్చినట్లు మాట్లాడడం తనను తీవ్రంగా కలిచివేసిందని, దీంతో అసహనంతో అలా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఏదైనా ఉంటే నేరుగా మాట్లాడాలే కానీ వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులు, ముఖ్యంగా చనిపోయిన వ్యక్తుల పై ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. వారి పైన దుమ్మెత్తి పోయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఏదైనా అలా చేయడం తన తప్పేనంటూ మరో సారి క్షమాపణలు ఎమ్మెల్యే వివేకానంద చెప్పారు.

# ఏడు కిలోల బంగారం పట్టివేత

- సంగారెడ్డి జిల్లాలో చెకింగ్
- తనిఖీల్లో పట్టుబడ్డ ఆధారాలు లేని సొత్తు
- లిక్కర్, వెండి, గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతున్నాయంటున్న పోలీసులు

తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో చేసిన తనిఖీల్లో వందల కోట్ల సొత్తు పట్టుబడింది. ఈ తనిఖీల్లో నగదుతో పాటు బంగారం, మద్యం, వెండి, గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతున్నాయని పోలీసులు చెబుతున్నారు.

తాజాగా సంగారెడ్డి జిల్లా చిరాగ్ పల్లి అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద పోలీసు తనిఖీల్లో భారీగా బంగారం పట్టుబడింది. తెలంగాణకర్ణాటక బార్డర్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు తెల్లవారుజామున వాహన తనిఖీలు చేపడుతుండగా... స్కార్పియోలో తరలిస్తున్న ఏడు కేజీల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు బిస్కెట్లు,ఆభరణాల రూపంలో బంగారం తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్రమ రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నమన్నారు.బంగారానికి సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించనున్నట్లు చిరాగ్ పల్లి ఎస్సై నరేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

## అంబటికి ఖమ్మంలో
# నిరసన సెగ

### గో బ్యాక్ అంటూ నినాదాలు

ఖమ్మం ఏపీ మంత్రి అంబటి రాంబాబుకు తెలంగాణలోని ఖమ్మంలో చేదు అనుభవం ఎదురయింది. ఒక బీఆర్ఎస్ నేత ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యేందుకు ఆయన ఖమ్మంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన నగరంలోని ఒక హోటల్ లో టిఫిన్ చేసేందుకు వెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకున్న టీడీపీ శ్రేణులు హోటల్ వద్దకు చేరుకున్నాయి. అంబటిని అడ్డుకునేందుకు యత్నించారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారంటూ హోటల్ ముందు వారు ధర్నాకు దిగారు. అంబటి రాంబాబు గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఏపీ ముఖ్యమంత్రి జగన్ కు వ్యతిరేకంగా వారు నినదించారు. ఈ విషయం గురించి తెలుసుకున్న పోలీసులు హోటల్ వద్దకు చేరుకుని అంబటి రాంబాబును అక్కడి నుంచి సురక్షితంగా పంపించేశారు.